
సాక్షి
ఒడిశా

శనివారం । 7 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,16,903లు, బంగారం 150 మిల్లీగ్రాములు, వెండి 81.5 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



నేడే ప్రజాభిప్రాయ సేకరణ

● మాలి పర్వతం గనుల తవ్వకాలపై సర్వత్రా ఉత్కంఠ

- 8లో.



ఉత్సవ్ జ్యోతికి ఊరూరా స్వాగతం

- 8లో.

న్యూస్‌రీల్

కోలుకున్న ఎంపీ షడంగి



ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగి

భువనేశ్వర్: బాలాసోర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మాజీమంత్రి ప్రతాప్ చంద్ర షడంగి ఆరోగ్యవంతంగా కోలుకున్నారు. ఆస్పత్రి నుంచి శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ఇటీవల జలుబు, జ్వరం, ఛాతీ నొప్పితో ఇటీవల చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే.

ఉత్తమ పోలీసు స్టేషన్‌గా అస్కా



అస్కా పోలీసు స్టేషన్

బరంపురం: గంజాం జిల్లా పోలీస్ పరిధిలోని అస్కా పోలీసు స్టేషన్ ఉత్తమ పోలీసు స్టేషన్‌గా కేంద్రం హోంశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంములో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం హోంశాఖ నుంచి అధికారిక ధ్రువీకరణ పత్రం పంపినట్లు గంజాం ఎస్పీ బ్రజేష్‌కుమార్ రాయ్ తెలిపారు.

విజిలెన్స్ వలలో రెవెన్యూ అధికారి



ఏఆర్ఐ జగదీష్ బెహరా

కొరాపుట్: విజిలెన్స్ వలకు రెవెన్యూ విభాగం అదనపు ఇన్‌స్పెక్టర్ చిక్కారు. నవరంగ్‌పూర్ జిల్లా సన్నమసిగాం గ్రామ ఏఆర్ఐ జగదీష్ బెహరా రూ.5 వేలు లంచం తీసుకుంటూ విజిలెన్స్ అధికారులకు శుక్రవారం పట్టుబడ్డారు. గ్రామానికి చెందిన వైజయంతి భొత్రా తల్లి చనిపోవడంతో ధ్రువీకరణ పత్రం కోసం ఏఆర్ఐను సంప్రదించారు. అయితే ఆయన రూ.5 వేలు డిమాండ్ చేయడంతో బాధితురాలు విజిలెన్స్ అధికారుల ఆశ్రయం కోరారు. వారి సూచనతో కార్యాలయం వెలుపల అధికారికి డబ్బులు ఇస్తుండగా సమీపంలో మాటు వేసి ఉన్న విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం నవరంగ్‌పూర్ లోని విజిలెన్స్ కారాలయానికి తరలించారు. వెంటనే అతని నివాసం ఉంటున్న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ క్వార్టర్స్‌లో తనిఖీలు చేశారు. బ్యాంక్ ఖాతాలు సీజ్ చేసి, జయపురం లోని విజిలెన్స్ ఎస్పీ కార్యాలయాకి తరలించారు.

బడ్జెట్‌పై ముందస్తు సంప్రదింపులు

భువనేశ్వర్: రానున్న ఆర్థిక సంవత్సరం 202-24కి సంబంధించి బడ్జెట్ కూర్పుపై కసరత్తు జరుగుతోంది. కొత్త బడ్జెట్ రూపకల్పన పురస్కరించుకుని ఆర్థికశాఖ పలు సన్నాహాలు చేస్తోంది. గతంలో సాధారణ వర్గాల అభిప్రాయాలు, సలహాల కోసం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్థికమంత్రి నిరంజన్ పూజారి అధ్యక్షతన స్టేట్ గెస్ట్‌హౌస్‌లో బడ్జెట్ ముందస్తు సంప్రదింపుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఆర్థికశాఖ కార్యదర్శి, ఆర్థికమంత్రి మాజీ కార్యదర్శి, అధికారులు, ఆర్థికవేత్తలు, నిపుణులు పాల్గొన్నారు. ఈ సమావేశం రెండు దశల్లో జరగనుండగా, ఫిబ్రవరి మూడో వారంలో 2023–24 బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశాలు ఉన్నాయి. సంప్రదింపుల సమావేశంలో బడ్జెట్‌లో భారీ, కొత్త పథకాలను ఖరారు చేయనున్నట్లు భావిస్తున్నారు.

'సీవా' సేవలు అభినందనీయం



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

జయపురం: సమాజానికి అన్ని రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న జయపురం సోషల్ ఎడ్యుకేషనల్, ఇన్విరాన్‌మెంటల్ అసోసియేషన్(సీవా) స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. సీవా 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మనోహర ఉద్యానవనంలో నిర్వహించిన సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరం, మొక్కలు నాటడం, వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా, కొరాపుట్ కేంద్రీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శరత్‌కుమార్ పాలిడ, మాజీమంత్రి రబినారాయణ నందో, సంస్థ అధ్యక్షుడు అజయకుమార్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



రావణాసురునిగా జయపురం కళాకారుడు



ఆకట్టుకున్న ఆదివాసీ మహిళల నృత్యం

సంప్రదాయ సంబరం

- ఆదివాసీ పుషిపుణి భేట్‌ఘాట్ పండగ ప్రారంభం
- జయపురంలో భారీ ర్యాలీ చేపట్టిన కళాకారులు
- ఆదివాసీ వేషధారణలో సందడి చేసిన ఎమ్మెల్యే తారాప్రసాద్
- కుంద్రాలో వాలీబాల్ పోటీలు ప్రారంభం



పుషిపుణి భేట్‌ఘాట్‌లో దేవీపీఠం వద్ద పూజలు చేస్తున్న పూజారులు



ఆదివాసీగా చిన్నారులతో కలిసి సందడి చేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్



బేట్‌ఘాట్ ర్యాలీలో కృష్ణార్జునుల వేషధారణలో రథంపై కళాకారులు



సంప్రదాయ దురువ నృత్యం చేస్తున్న గిరిజనులు

జయపురం: కొరాపుట్ జిల్లా ఆదివాసీ సంప్రదాయ పండగ పుషిపుణి సందడిగా ప్రారంభమైంది. స్థానిక ఆదివాసీలు జరుపుకొనే 12 మాసాల్లో 13 పండగలు ప్రధానమైనవి. ఇందులో పుషిపుణి పర్వ్ ప్రత్యేక సంతరించుకుంది. శుక్రవారం సాయంత్రం జయపురంలో కళాకారులు బృందం నిర్వహించిన పుషిపుణి భెట్‌ఘాట్(పర్వ్) అవిభక్త కొరాపుట్ ఆదివాసీ ప్రజల కళా సంస్కృతులకు అద్దం పట్టింది. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటలకు మా భగవతీ దేవి మందిరంలో పూజలు చేసి, భారీ ర్యాలీ నిర్వహించారు. కృష్ణార్జుల వేషధారణలో కళకారులు అధిరోహించిన రథం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి కొరాపుట్ ఆదివాసీగా అశేష ప్రజానీకాన్ని అలరించారు. ఈ సందర్భంగా జనం ననాకే(బాహిణీపతికి మారుపేరు) నినాదాలతో హోరెత్తించారు. అలాగే జయపురం కళాకారులు రామాయణ, మహాభారత, పౌరాణిక గాథల వేషధారలతో ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన వందలామంది ఆదివాసీలు తమ సంప్రదాయ నృత్య, నాట్య, వాయిద్యాలతో ఆదివాసీ సంస్కృతిని ప్రదర్శించారు. ఎన్‌సీసీ విద్యార్థులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, పట్టణ ప్రముఖుల మధ్య పట్టణ మెయిన్ రోడ్డులో సాగిన ర్యాలీ.. పారాబెడలోని విక్రమదేవ్ స్టేడియం మైదానం వరకు జరిగింది. పుషిపుణి బేట్‌ఘాట్ కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ కళాకారుడు ధీరేన్ మోహన పట్నాయక్, మాజీమంత్రి రబినారాయణ నందో, నాయకులు పాల్గొన్నారు.

ఈనెల 8వరకు..

జయపురం సబ్ డివిజన్ కుంద్రా సహిద్ లక్ష్మణ నాయక్ క్రీడా మైదానంలో శుక్రవారం సంప్రదాయ పూజలు చేపట్టారు. దేవీపీఠంలో అమ్మవారికి పూజలు చేసిన అనంతరం మహా పురుషుల ప్రతిమూర్తులకు పుష్పాలు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను కుంద్రా సమితి అధ్యక్షురాలు రాజేశ్వర పొరజ ప్రారంభించారు. 16 జట్లు పోటీల్లో తలపడనున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ పోటీలు ఈనెల 8న జరగనున్న ఫైనల్ మ్యాచ్‌తో ముగుస్తాయన్నారు. కుంద్రా–ఖసింగగుడ మధ్య జరిగిన తొలి మ్యాచ్ జరిగింది. వివేక్‌కుమార్ పండా రిఫరీగా వ్యవహరించారు. కార్యక్రమంలో పూజా కమిటీ కార్యదర్శి త్రినాథ్ సమరథ్, ఉపాధ్యక్షుడు చంద్ర సాగరియ, గ్రామ పెద్దలు మాలి నాయక్, పితాంబర నాయక్, భోజమన శాంత, భక్త నాయక్, మనోజ్‌కుమార్ బెహరా, రామనాయిక్ ధనుర్జయ గోండ్, జిల్లా పరిషత్ సభ్యులు కనకలత పెంటియా, కుంద్రా పోలీసు అధికారి సమర్పిల స్వాయి, జిల్లా ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం నాయకుడు త్రినాథ్ హరిజన్, సమితి సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, జిల్లా పరిషత్ సభ్యులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమమే సీఎం నవీన్ జీవితాశయం

- నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి
- కొరాపుట్, రాయిఘర్‌లో ఘనంగా వ్యవస్థాపక వేడుకలు



రాయిఘర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ రమేష్, ఎమ్మెల్యేలు



కొరాపుట్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీజేడీ నాయకులు

కొరాపుట్: పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ జీవిత ఆశయమని నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి అన్నారు. నవరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కేంద్రంలో ఉమ్మర్‌కోట్ విధానసభ పరిధిలో బీజేడీ 25వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించి, ప్రసంగించారు. సుమారు 3 దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో ఆకలి కేకలు వినిపించేవని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం గిరిజనులు అన్ని రంగాల్లో ముందుకు దూసుకు పోతున్నారని తెలిపారు. అంతకుముందు కార్యకర్తలు పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. కార్యాక్రమంలో రాష్ట్ర ప్రత్యేక డెవలప్‌మెంట్ కౌన్సిల్ సలహాదారుడు ప్రదీప్ మాఝి, కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు, పార్టీ జిల్లా పరిశీలకుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహీ, జిల్లా పరిషత్ అధ్యక్షుడు మోతిరాం నాయక్, మాజీ ఎమ్మెల్యే సుభాష్ గోండో తదితరులు పాల్గొన్నారు.

బహిష్కరించిన మీడియా..

కొరాపుట్‌లో నిర్వహించిన అసెంబ్లీ స్థాయి బీజేడీ వ్యవస్థాపక దినోత్సవంలో జిల్లా నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు ర్యాలీగా సభా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. కొరాపుట్ ఎమ్మెల్యే, రఘురాం పొడాల్, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభు జానీ, మాజీ ఎమ్మెల్యే గుప్తప్రసాద్ దాస్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా, మున్సిపల్ చైర్మన్ లలెటిందు రంజన్‌శెఠి, సునాబెడా చైర్మన్ రాజేంద్రకుమార్ పాత్రొ, ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర్ మాఝి తదితరులు పాల్గొన్నారు. అయితే ఈ సమావేశాన్ని మీడియా ప్రతినిధులు భహిష్కరించారు. సభా ప్రాంగణం వద్ద మీడియాకు కేటాయించిన సీట్లను కొందరు యువకులు ఆక్రమించుకున్నారు. అలాగే వీడియో గ్రాఫర్లకు అడ్డంగా నిలబడి అంతరాయం కలిగించారు. దీనిపై పార్టీ నాయకులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో తమకు భద్రత లేనందున అక్కడ ఉండలేమంటూ మీడియా ప్రతినిధులు కార్యక్రమాన్ని బహిష్కరించారు.

సిబ్బందికి సెలవుల్లేవ్

- హాకీ ప్రపంచకప్ సమీక్షలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ఒడిశా హాకీ పురుషుల ప్రపంచకప్ నిర్వహణ పురస్కరించుకుని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సన్నద్ధతపై ఉన్నతాధికారులు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ టోర్నీ ప్రాముఖ్యత, సమాజ భాగస్వామ్యం ప్రాధాన్యతపై చర్చించారు. వైద్య కళాశాలల సూపరింటెండెంట్లు, డీన్లు, ప్రిన్సిపాళ్లు, జిల్లా ప్రధాన వైద్యాధికారి, ప్రధాన ఆరోగ్య అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచకప్ సమయంలో ఆరోగ్య సిబ్బంది సాధారణ సెలవులు మంజూరుపై ఆంక్షలు విధించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సెలవు మంజూరు చేయాలని కటక్, ఖుర్దా, సుందరగడ్, ఝార్సుగుడ జిల్లా ప్రధాన వైద్యాధికారి, ప్రధాన ఆరోగ్య అధికారులకు ఆదేశించారు. ఈ 4 జిల్లాల వైద్య కళాశాల ఆస్పత్రుల సూపరింటెండెంట్ తోపాటు రూర్కెలా ఆర్‌జీహెచ్, స్థానిక క్యాపిటల్ ఆస్పత్రి డైరెక్టర్లకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

మందుల నిల్వలపై..

హాకీ ప్రపంచకప్ నిర్వహణ దష్ట్యా అవసరమైన మందులు, వైద్య పరికరాలు అనుబంధ సామగ్రి ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేస్తారు. ఈ మేరకు అవసరమైన ప్రతిపాదనలు ప్రణాళికయుతంగా దాఖలుకు ఆదేశించారు. ఈ మేరకు 4 జిల్లాల ప్రధాన వైద్యాధికారులు, డైరెక్టర్లు ఒడిశా రాష్ట్ర ఔషధ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు దరఖాస్తు చేయాలని తెలిపారు.

కోవిడ్ పరీక్షలు..

సత్వర ఆస్పత్రి చికిత్స నేపథ్యంలో స్థానిక క్యాపిటల్ ఆస్పత్రి, రూర్కెలా ఆర్‌జీహెచ్‌లో 50 చొప్పున, సుందర్‌ఘర్, ఝార్సుగుడ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో 20 చొప్పున పడకలు ప్రత్యేకంగా కేటాయించాలని అధికారులను ఆదేశించారు. భువనేశ్వర్, కటక్, రౌర్కెలా ప్రాంతాల్లో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో కోవిడ్ పరీక్షల కోసం కోసం ఆర్‌ఏటీ, స్వాబ్ సేకరణ కోసం అనుబంధ ఏర్పాట్లు తప్పనిసరిగా చేపట్టాలని పేర్కొన్నారు.

మెడికల్ ప్రొఫెసర్లకు వేతనాలు పెంపు

భువనేశ్వర్: ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రుల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపక సిబ్బంది వేతనాలను రాష్ట్రప్రభుత్వం పెంచింది. 3 వర్గాలుగా కాంట్రాక్టు ప్రాతిపదికన అధ్యాపకులు బోధన నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వేతనంతో పాటు అదనంగా ఆర్థిక ప్రోత్సాహకాలను పెంచినట్లు రాష్ట్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమశాఖ పేర్కొంది. జోన్ల వారీగా వీటిని మంజూరు చేయనున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ప్రకటించారు.

వైద్య బోధనా సిబ్బందికి పెంచిన జీతాల వివరాలు

హోదా	వేతనం (రూపాయల్లో)
ప్రొఫెసర్	2,30,000 + ఏటా 5శాతం పెంపు
అనుబంధ ప్రొఫెసర్	2,00,000 + ఏటా 5శాతం పెంపు
సహాయ ప్రొఫెసర్	1,20,000 + ఏటా 5శాతం పెంపు



జోనువారీగా అదనపు ఆర్థిక ప్రోత్సాహకాలు (రూపాయల్లో)

జోన్	ప్రాంతాలు	ప్రొఫెసర్	అనుబంధ ప్రొఫెసర్	సహాయ ప్రొఫెసర్
ఏ	కొరాపుట్, నవరంగపూర్, మల్కన్‌గిరి, రాయగడ, బొలంగీర్, నువాపడా, కలహండి, కంధమల్	1,50,000	70,00	50,000
బీ	కెంజొహర్, బౌధ్, బాలాసోర్, గజపతి, సోన్‌పూర్, దేవ్‌గడ్, బర్‌గడ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, అంగుల్, సుందరగడ్, మయూర్‌భంజ్	1,25,000	50,000	35,000
సీ	డెంఖనాల్, పూరీ, నయాగడ్, కేంద్రాపడా, జాజ్‌పూర్, భద్రక్, జగత్‌సింఘ్‌పూర్	75,000	30,000	20,000

అనుమతులు లేకుంటే నో ఎంట్రీ

- కొఠియాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 104 వాహనాన్ని అడ్డుకున్న ఒడిశా పోలీసులు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అబ్దుల్ అక్తర్



ఆంధ్ర వైద్య సిబ్బందిని ప్రశ్నిస్తున్న కొఠియా పోలీసులు

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాలో మారోసారి వివాదం జరిగింది. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా పంచాయతీ ఉప్పరశెంబి వద్ద ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్న 104 వైద్య సిబ్బంది వాహనాలను ఒడిశా పోలీసులు శుక్రవారం అడ్డగించారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలానికి చెందిన ప్రభుత్వ వైద్య సిబ్బంది ఉప్పరశెంబి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించేందుకు బయలుదేరారు. విషయం తెలుసుకున్న ఒడిశా పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. వాహనంలో ఉన్న ప్రభుత్వ వైద్యుడు ఏ.అజయ్ స్పందిస్తూ తాము వైద్య సేవలు అందించడానికి వచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ఇది ఒడిశా భూభాగమని, స్థానిక ప్రభుత్వ అనుమతి లేకుండా సేవలకు అంగీకరించమని పోలీసులు స్పష్టంచేశారు. దీంతో కొంత సమయం వేచి ఉన్న వైద్య సిబ్బంది.. చివరకు సాలూరుకు వెనుతిరిగారు.

కొఠియాపై అత్యవసర సమీక్ష..

కొరాపుట్ జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ జిల్లా కేంద్రంలో సద్భావనా స్వగృహంలో కొఠియా పంచాయతీపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. కొఠియాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతి, వచ్చిన నిధుల, ఖర్చులు, బకాయిలు, కొత్త పథకాలపై వివరాలు సేకరించారు. యుద్ధ ప్రాతిపదికన కొఠియా అభివృద్ధి జరగాలని, నిధుల కోసం వెనుకాడవద్దని సూచించారు. సమావేశంలో ఏడీఎం రామేశ్వర ప్రధాన్, డీఆర్‌డీఏ పీడీ గౌరబ్ శివాజీ ఈశ్వర్‌లాల్, సీడీఎంఒ అరుణ్ పాఢి, రెవెన్యూ, వైద్య, విద్య, విద్యుత్, నీటి పారుదల, ఉద్యానవన, వ్యవసాయ, అటవీ, పోలీసు తదితర శాఖల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

పార్వతీపురం టౌన్: ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు సమకూర్చుతోందని డీఈఓ ఎస్‌డీవీ రమణ తెలిపారు. జిల్లాకు మంజూరైన రూ.5.50 లక్షలు విలువచేసే ట్రైసైకిళ్లు-13, వీల్‌చైర్లు-35, వినికిడి యంత్రాలు-28, రొలేటర్స్-11, సీపీ చైర్స్-9ను విద్యార్థులకు డీఈఓ కార్యాలయం వద్ద శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఐఈ కోఆర్డినేటర్ భానుమూర్తి, సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు సీజ్



పార్వతీపురంలో పోలీసులు సీజ్ చేసిన లారీలు

పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలంలోని నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను సీజ్ చేశామని ఎస్సై శివప్రసాద్ తెలిపారు. సంకిలి సమీపంలోని నాగావళి బ్రిడ్జివద్ద జిల్లా అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్ ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి సమయంలో దాడులు నిర్వహించామని, ఆ సమయంలో ఇసుకతో వెళ్తున్న 13 లారీలు, ఖాళీగా ఉన్న మరో 7 లారీలను సీజ్‌చేసి పార్వతీపురం తరలించామని చెప్పారు. లారీ డ్రైవర్లు, యజమానులతో పాటు, ఇద్దరు నిర్వాహకులపై కేసు నమోదు చేశామన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం

- కోపరేటివ్ డివిజనల్ రిజిస్ట్రార్ అలజంగి జార్జి

సీతానగరం: మండలంలోని పీఏసీఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోలును వేగవంతం చేస్తామని పార్వతీపురం మన్యం జిల్లా డివిజనల్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ అలజంగి జార్జి అన్నారు. ఆర్.వెంకంపేట, కాశీపేట పీఏసీఎస్‌లు, రైతుభరోసా కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ధాన్యం కొనుగోలు తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్‌ల పరిధిలో 229 మంది రైతులున్నారని, ఇప్పటివరకు 853.8 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్లు పి.సత్యం, ధనుంజనాయుడు, సర్పంచ్ పి.శ్రీనివాసరావు, సీఈఓలు వై.త్రినాథ్, ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌బీకే వ్యవసాయ సహాయకుడు జగదీష్, టి.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

జాతీయ సైక్లింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న సైక్లింగ్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు అర్హత సాధించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్స్, సీనియర్స్ విభాగాల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డి.గణేష్, ఎస్.ఇంద్రావతిలు ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మహారాష్ట్రలోని షిర్డీలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సైక్లింగ్ అసిసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికైన ఇరువురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో రాణించాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు ఆకాంక్షించారు.

మూడు నెలల తర్వాత మృతుడి గుర్తింపు

- లొంగిపోయిన నిందితులు

బొబ్బిలి రూరల్: గతేడాది అక్టోబర్ 28న కలువరాయి గ్రామశివారులో నేలబావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన విషయం తెలిసిందే. అప్పట్లో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయగా...తాజాగా నిందితులు పట్టుబడడంతో మృతుడి వివరాలు వెలుగుచూశాయి. పట్టణ సీఐ ఎం.నాగేశ్వరరావు తెలియజేసిన వివరాల ప్రకారం.. గతేడాది అక్టోబర్ 28న నేలబావిలో లభ్యమైన మృతదేహం కలువరాయి గ్రామానికి చెందిన పాము సింహాచలానిది గుర్తించారు. గ్రామానికి చెందిన పడాల అప్పన్నకు సింహాచలం మధ్య విబేధాలు ఉండడంతో అప్పన్న, గుడిపూడి నారాయణరావు సహకారంతో సింహాచలంను హత్య చేసి బావిలో పడేశారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేయగా.. ఇటీవల నిందితులు మద్యం మత్తులో తామే సింహాచలంను హత్య చేసినట్లు గ్రామానికి చెందిన ముచ్చి గంగమ్మకు చెప్పారు. దీంతో ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితులు పరారయ్యారు. ఇదిలా ఉంటే సర్పంచ్ బొత్స నటరాజ్ వద్ద నిందితులు అప్పన్న, నారాయణరావు నేరం అంగీకరించి పోలీసులకు శుక్రవారం లొంగిపోయారు.

నేడే ప్రజాభిప్రాయ సభ

- మాలి పర్వతం గనుల తవ్వకాలపై సర్వత్రా ఉత్కంఠ
- భయం గుప్పిట్లో దండకారణ్యం ప్రజలు



కొంకదాహండి వద్ద సభా వేదిక ఏర్పాట్లు

కొరాపుట్: మాలి పర్వతంపై గనుల త్రవ్వకాలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ సభ శనివారం జరగనుంది. దీంతో దండకారణ్యం లోని గిరిజన గ్రామాలు భయం గుప్పిట్లో బిక్కుబిక్కుమంటున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి కొంకడాఅంబ గ్రామ సమీపంలో భారీ వేదిక నిర్మిస్తున్నారు. వేదిక ప్రాంగణానికి 2 కిలోమీటర్ల పరిధిలో 144 సెక్షన్ విధించారు. 28 ప్లాటూన్ల పోలీసు బలగాలు ఇప్పటికే సమీప గ్రామాలకు చేరుకున్నాయి. బాక్సైట్ గనుల ప్రభావం ఉన్న 4 గ్రామ పంచాయతీల్లోని 20 గ్రామాల్లో పోలీసులు శుక్రవారం కూడా ఫ్లాగ్‌మార్చ్ చేశారు. ఐఆర్‌బీ, కోబ్రా, రిజర్వ్, సివిల్ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. దక్షిణాంచల్ డీఐజీ రాజేష్ పండిట్ పరిస్థితి సమీక్షిస్తున్నారు. 14 సమితులలోని ఐఐసీలను సిమిలిగుడ రప్పించారు. ఇద్దరు ఏఎస్పీలు, ఎస్‌డీపీఓలు సెక్టర్లుగా విభజించి, బాధ్యతలు అప్పగించారు. ఈ ప్రాంతం సంబంధం లేని ఇతర వ్యక్తుల ఆచూకీ కోసం గాలిస్తూ పట్టుబడిన వారిని బయటకు పంపించేస్తున్నారు. లాడ్జిలు తనిఖీ చేస్తూ అనుమానితులపై నిఘా పెట్టారు. జాతీయ రహదారిపై రాత్రింబవళ్లు నాకా బందీ కొనసాగుతోంది. హైకోర్టు ఆదేశాల ప్రకారం జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్పీ, అటవీశాఖ ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. మొత్తం వీడియో నిఘాలో జరిపి, హైకోర్టుకు నివేదిక ఇవ్వనున్నారు. సభకు వచ్చే గిరిజనులు తమ సంప్రదాయ ఆయుధాలు కూడా తీసుకురావద్దని మైక్‌ల ద్వారా పోలీసులు ప్రచారం చేస్తున్నారు. ఆయా గిరిజన తెగల పెద్దలతో సమావేశమై, శాంతియుత వాతావరణానికి సహకరించాలని సూచిస్తున్నారు. మాలి పర్వత సురక్ష సమితి నేతల కదలికపై కూడా కన్నేసి ఉంచారు. మరోవైపు మావోయిస్టుల హెచ్చరికల నేపథ్యంలో నేటి సభపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



గిరిజన గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తప్తపాణి ఘాట్‌పై బస్సు బోల్తా



తప్తపాణి ఘాట్ రోడ్డులో బోల్తా పడి ఉన్న బస్సు

- 10 మంది ప్రయాణికులకు గాయాలు

బరంపురం: గంజాం, గజపతి జిల్లాల సరిహద్దు తప్తపాణీ ఘాట్ రోడ్‌లో గురువారం ఉదయం ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 10 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పట్టపూర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, ప్రయాణికులను రక్షించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం 6 గంటల సమయంలో గజపతి జిల్లా మోహానా నుంచి ఓ ప్రైవేటు బస్సు 40మంది ప్రయాణికులతో బరంపురం బయలు దేరింది. ఉదయం తీవ్రంగా మంచు కురవడంతో రహదారి కనిపించక తప్తపాణి ఘాట్ రోడ్డులోని పట్టపూర్ పోలీసు స్టేషన్ పరిధి కెమండి కాలువ వంతెన గట్టుని ఢీకొట్టి బోల్తా పడింది. సమాచారం అందుకున్న పట్టపూర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని గాయాలపాలైన 10మంది ప్రయాణికులను బంజనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనతో వాహనాల రాకపోకలపై తీవ్ర ప్రభావం ఏర్పడింది. సుమారు మూడు గంటలకు పైగా గజపతి-బరంపురం మధ్య వాహనాలు నిలిచిపోయాయి.

ఉత్సవ్ జ్యోతికి ఊరూరా స్వాగతం

- మహేంద్రగిరి నుంచి పర్లాకిమిడి చేరుకున్న మసాల్
- ఆహ్వానించిన కలెక్టర్ లింగరాజ్ పండా, ప్రజా ప్రతినిధులు



మహేంద్రగిరి కుంతీ మందిరం నుంచి బయలుదేరిన గజపతి ఉత్సవాల జ్యోతి



ర్యాలీలో విద్యార్థినుల సంప్రదాయ నృత్యాలు, పక్కన కలెక్టర్ పండా

పర్లాకిమిడి: గజపతి ఉత్సవ్-2022 జ్యోతి మహేంద్రగిరి పర్వతాల నుంచి రాయఘడ, గుసాని సమితి మీదుగా శుక్రవారం పర్లాకిమిడి చేరుకుంది. ఈ సందర్భంగా రాయఘడ బ్లాక్ చైర్మన్ పూర్ణబాసి నాయక్, గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు జ్యోతిని ఘనంగా ఆహ్వానించి, పాఠశాల విద్యార్థులతో కలిసి గురండి జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. పర్లాకిమిడి ఫారెస్ట్ గేటు వద్ద జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఏడీఎం సంగ్రాం శేఖర పండా, మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలాశెఠి గజపతి ఉత్సవ్ జ్యోతిని హైస్కూల్ జంక్షన్ వరకు ఊరేగించారు. రాజ వీధిలోని జగన్నాథ మందిరం వద్ద పూజలు జరిపారు. అనంతరం జిల్లా యంత్రాంగంతో గజపతి స్టేడియానికి తరలించారు. ఈనెల 18 నుంచి 25 వరకు జరుగనున్న గజపతి ఉత్సవాలు, పల్లెశ్రీ ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ఎస్‌హెచ్‌జీ గ్రూపులు తయారు చేసిన క్రీడా జ్యోతి, అటవీద్రవ్య వస్తువులు, రాజస్థానీ తివాచీలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య నాట్య ప్రదర్శనలు జరగనున్నాయని కమిటీ చైర్మన్, కలెక్టర్ లింగరాజ్ పండా వెల్లడించారు. ఉత్సవ్ జ్యోతి ర్యాలీలో సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, జాజిపురం భజన సంకీర్తన మండలి, ఒడిస్సీ కళాకారులు పాల్గొన్నారు.

అండర్-19 స్కూల్‌గేమ్స్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపికలు శుక్రవారం పూర్తయ్యాయి. నగరంలోని అయోధ్యామైదానంలో అండర్-19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 30 మంది క్రీడాకారులు హాజరుకాగా.. వారికి బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అంశాల్లో క్రీడాకారులకు వ్యక్తిగత సామర్థ్య పరీక్ష నిర్వహించారు. అందులో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. వీరు ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని ఏజేకే కళాశాలలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపిక పోటీలను ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కృష్ణ, పెనుమత్స బంగార్రాజు తదతరులు పర్యవేక్షించారు. అలాగే అనకాపల్లి జిల్లా అమల్ కళాశాలలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న అండర్-19 బాల, బాలికల బాస్కెట్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక పూర్తయింది. నగరంలోని విజ్జీ స్టేడియంలో నిర్వహించే ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జిల్లా జట్టులో స్థానం కల్పించారు.

ఇద్దరు స్టూవర్ట్‌పురం దొంగలు అరెస్టు

- రూ 70వేలు నగదు, ఐదుసెల్ ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం
- వీరిపై పలు స్టేషన్లలో కేసుల నమోదు



విలేకరులకు కేసు వివరాలు వెల్లడిస్తున్న విజయనగరం రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్:

స్టూవర్ట్‌పురం దొంగలను విజయనగరం రూరల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఫిర్యాదు అందుకున్న ఒకటిన్నర రోజుల వ్యవధిలోనే అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలను రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు శుక్రవారం వెల్లడించారు.

బాపట్ల జిల్లా చినబేతపూడి పంచాయతీ వెదుళ్లపల్లి, స్టూవర్ట్‌పురం గ్రామాలకు చెందిన మానుపాటి దుర్గాప్రసాద్ అలియాస్ చిన్నోడు, కర్రెద్దుల మహేష్ అలియాస్ చినబాబు ఈ నెల 4వ తేదీన ఏటీఎం వద్ద నగదు విత్ డ్రా చేసే వృద్ధుల కోసం పడిగాపులు కాశారు. ద్వారపూడికి చెందిన డోలపాపుడు అనే వ్యక్తి ఏటీఎంలో డబ్బులు డ్రా చేసి స్కూటీ డిక్కీలో పెట్టుకున్నాడు. అక్కడ నుంచి ద్వారపూడి పంచాయతీ విజయకుమార్ లేఅవుట్ వద్ద ఆపి మలమూత్ర విసర్జనకు వెళ్లాడు. అతడిని గమనిస్తూ వెంట వచ్చిన స్టూవర్ట్‌పురం దొంగలు తమ వద్దనున్న ఆయుధాలతో డిక్కీ ఓపెన్ చేశారు. ఈలోపు గమనించిన బాధితుడు వారివద్దకు వచ్చేసరికి కత్తితో బెదిరించి, డిక్కీలో ఉన్న రూ.లక్షా 10వేలు నగదు, భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు, చెక్‌బుక్, గోల్డ్‌లోన్ డాక్యుమెంట్లు, డైరీలు, ఇంటి తాళాలు, బైక్ పేపర్లను పట్టుకుని పారిపోయారు. బాధితుడు లబోదిబోమంటూ రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. ఎస్పీ దీపిక ఎం.పాటిల్ ఆదేశాలతో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీ ఫుటేజీలు ఆధారంగా నిందితులను గుర్తించారు. శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ధర్మపురి వసంత విహార్ వద్ద నిందితులను పట్టుకుని వారివద్ద నుంచి రూ.70వేలు నగదు, ఒక స్కూటీ, నేరం చేయడానికి ఉపయోగించిన హీరో స్పెండర్ బైక్, గతంలో వేర్వేరు చోట్ల దొంగతనం చేసిన ఐదు సెల్‌ఫోన్లు, నేరాలు చేసేందుకు ఉపయోగించే ఇనుప సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల, చీరాల, ఒంగోలు, ఉమ్మడి గుంటూరు జిల్లాలో నిందితుడు దుర్గాప్రసాద్‌పై 12 కేసులు, మహేష్‌పై ఐదు కేసులు నమోదైనట్టు గుర్తించారు. ఉత్తరాంధ్రాలో తొలిసారిగా దొంగతనానికి పాల్పడినట్టు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన ఏఎస్‌ఐ త్రినాథ్, కానిస్టేబుల్ షఫీలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో రూరల్ ఎస్‌ఐ గణేష్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు, చోరీకి ఉపయోగించే ఇనుప సామాగ్రి, సెల్‌ఫోన్లు

రైతు ఇంట బెల్లం పంట

- రేగిడి, సంతకవిటి, తెర్లాం మండలాల్లో విరివిగా బెల్లంగానుగల నిర్వహణ
- సంక్రాంతికి విక్రయించేలా బెల్లం తయారీ
- మార్కెట్‌లో టన్ను బెల్లం ధర రూ.40 వేలు
- ఎకరా విస్తీర్ణంలోని పంట నుంచి 3-4 టన్నుల బెల్లం లభ్యం



హొంజరాం సమీపంలో చెరకు పంట

రాజాం:

సంక్రాంతి పండగ.. పిండి వంటలకు ప్రత్యేకం. ఇంటిల్లిపాదికి ఇష్టపడేలా వారం రోజుల ముందునుంచే మహిళలు పిండి వంటలను సిద్ధంచేస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే తమ కుటుంబీకులకు కమ్మనిచేతి వంటలు పెట్టాలని తాపత్రయపడతారు. ప్రధానంగా బెల్లంతో తయారుచేసే అప్పాలు, వరి పిండి ఉండలు, అరిసెలు, పప్పుబూరెలు, కొబ్బరి ఉండలు తదితర వంటకాలు ప్రతీ ఇంటిలోనూ కనిపిస్తాయి. సంక్రాంతి పండగ వచ్చిందంటే మార్కెట్‌లో బెల్లంకు డిమాండ్ ఉంటుంది. దీనిని అదనుగా చేసుకుని చెరకు రైతులు నాగావళి తీరంలో బెల్లం గానుగలను విరివిగా నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండగ మార్కెట్ డిమాండ్‌ను తీర్చేలా బెల్లంను సిద్ధం చేస్తున్నారు. నాగావళి నదీ తీరంలో ఏపుగా పెరిగే చెరకుతో నాణ్యమైన బెల్లం తయారవుతుండడం ఈ ప్రాంత రైతులకు కలిసివస్తోంది. రేగిడి, సంతకవిటి, తెర్లాం, రాజాం, వంగర తదితర మండలాల రైతులు బెల్లం తయారీలో బిజీ అయ్యారు.



ఘుమఘుమలాడే బెల్లం పాకం



బెల్లం చెక్కీలు



హొంజరాం సమీపంలో చెరకు పంట

జిల్లాలో చెరకు సాగు వివరాలు ఇలా..

చెరకు సాగు విస్తీర్ణం: 12 వేల హెక్టార్లు (ఖరీఫ్, రబీ కలిపి)	చెరకు దిగుబడి (ఎకరాకు): 40-50 టన్నులు
బెల్లం తయారీకి వినియోగించే పంటశాతం: 30	బెల్లం దిగుబడి: 3-4 టన్నులు
చెరకు పంట సాగు కాలం: 9 నుంచి 11నెలలు	ఎకరా పంటను గానుగాడేందుకు పట్టే కాలం: 15 రోజులు
చెరకుసాగులో రకాలు: 298(10 నెలలు), వి-46(11నెలలు), 82-0-32(10 నెలలు), తుని (ఏడాదిపంట)	బెల్లం ధర మార్కెట్‌లో(టన్ను): రూ.39 వేలు నుంచి రూ. 40 వేలు
చెరకును నాటే నెలలు: ఫిబ్రవరి, మార్చి	ఎకరాకు అయ్యే ఖర్చు: రూ. 50 వేలు
విత్తే రకాలు: విత్తనాలు (మూడు కనుపులు), మొక్కలు (ట్రేలు ద్వారా తయారీ), మమ్ము (తొలిపంటను నరికిన వెంటనే అగ్గిపెట్టి వేసేది)	చెరకుసాగుకు అనువైన నేలలు: ఇసుక, నల్లమట్టి నేలలు
ఎకరాకు అవసరమయ్యే విత్తనాలు: 10 గరిసెలు(2 టన్నులు)	చెరకు సాగుచేసే ప్రాంతాలు: జామి, బొబ్బిలి, ఎస్.కోట, మెంటాడ, రేగిడి, వంగర, సంతకవిటి, రాజాం తదితర ప్రాంతాలు

వాతావరణం అనుకూలించింది..

ఈ ఏడాది చెరకు సాగు బాగుంది. ప్రస్తుతం పంట కోతదశకు వచ్చింది. దిగుబడి బాగుంది. బెల్లం తయారుచేసే రైతులకు మార్కెట్ అనుకూలంగా ఉంది. గ్రామాల్లోనే బెల్లంను విక్రయాలు చురుగ్గా సాగుతున్నాయి.
– కె.రాము, మేదమర్తి, సంతకవిటి మండలం

మార్కెట్ బాగుంది

కోతదశకు వచ్చిన పంటను గానుగ ఆడించి బెల్లం తయారు చేస్తున్నాం. బెల్లంకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. మాకు పెట్టుబడులు పోనూ లాభం కనిపిస్తోంది. చాలామంది రైతులు బెల్లం తయారీపై దృష్టిసారించారు. సంక్రాంతి పండగ అవసరాలు తీరేలా బెల్లం తయారు చేస్తున్నారు.
– ఎన్వీ రమణారావు, డీసీసీబీ మాజీ చైర్మన్, చెరకు రైతు, హొంజరాం

రసాయనాలు వినియోగించకుండానే...

జిల్లాలో కేవలం సంకిలి వద్ద మాత్రమే చక్కెర కర్మాగారం ఉంది. చాలామంది రైతులు కర్మాగారానికి చెరకును తరలిస్తారు. సొంత గానుగలు ఉన్నవారు బెల్లం తయారు చేసి విక్రయిస్తారు. నాగావళి నదీతీర మండలాలైన వంగర, రేగిడి, సంతకవిటి తదితర మండలాల్లో చెరకు ఏపుగా పెరుగుతుంది. పంట కూడా తీయగా ఉండడంతో బెల్లం తయారీలో ఎటువంటి రసాయనాలు వినియోగించకుండానే రంగు, తియ్యదనం వస్తుంది. దీంతో సంతకవిటి మండలంలోని కొత్తూరు, జావాం, హొంజరాం, చిత్తారిపురం, బూరాడపేట, రేగిడి మండలంలోని ఖండ్యాం, కొమెర, తెర్లాం మండలంలోని పలు ప్రాంతాల్లోని బెల్లంకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇక్కడ బెల్లం గానుగలు వద్దే విక్రయాలు జరిగిపోతుంటాయి.

కుండల నుంచి చెక్కీలవైపు..

ఎకరా విస్తీర్ణంలో సాగుచేసిన చెరకును బెల్లంగా మార్చాలంటే సాధారణంగా 15 నుంచి 20 రోజులు కాలం పడుతుంది. పొలంలో చెరకును నరికి గానుగలు వద్దకు తరలిస్తారు. అక్కడ చెరకు గడలను నునుపుగా చేసి గానుగ యంత్రం ద్వారా రసం తీస్తారు. ఈ రసంను ఇనుప పెనంలో వేసి పాకం తీస్తారు. బాగా పాకం వచ్చిన తరువాత పక్కనే ఉన్న ఇనుప పల్లెంలో బెల్లం పాకం వేసి చెక్కీలుగా మార్చుతారు. గతంలో బెల్లంను కుండలకు ఎక్కించేవారు. ఇప్పుడు టెక్నాలజీ రావడంతో చెక్కీలకు ఎక్కించి, అనంతరం కవర్లలో పెట్టి మార్కెట్‌కు తరలిస్తారు. చిన్నచెక్కీ 6 నుంచి 7 కిలోలు ఉండగా, పెద్ద చెక్కీలు 14 కిలోలు ఉంటాయి.

క్లుప్తంగా

స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు రూ.7 లక్షల వితరణ



మహిళాసంఘ సభ్యులతో కలిసి ఊరేగింపుగా బయలుదేరుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘం సభ్యులు ఏప్రిల్ 17న జరగనున్న స్వేచ్ఛావతి అమ్మవారి గ్రామదేవత ఉత్సవాలకు రూ.7లక్షలు వితరణ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మెప్మా కార్యాలయం నుంచి మహిళాసంఘ సభ్యులంతా కలిగి ఊరేగింపుగా గ్రామదేవత ఆలయం వద్దకు చేరుకొన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.7,00,011ను చెక్‌రూపంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం జానకిరామారావు, సీఈఓలు బాలరాజు, సంతోష్, ఆర్పీలు, మహిళాసంఘ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో శ్రీకాంత్ ప్రతిభ



శ్రీకాంత్ మహంతిని అభినందిస్తున్న ధర్మాన కృష్ణదాస్

ఇచ్ఛాపురం: జాతీయ స్థాయి యోగా పోటీల్లో పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి ప్రతిభ కనబర్చాడు. ఇండియన్ యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 26 నుంచి 28 మధ్య పాండిచ్చేరిలో నిర్వహించిన యోగా పోటీల్లో 20 నుంచి 30 సంవత్సరాల విభాగంలో శ్రీకాంత్‌మహంతి పాల్గొని 4వ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు శ్రీకాంత్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం అభినందించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



సీతమ్మ(ఫైల్)

జి.సిగడాం: మండలంలోని ధవళపేటకు చెందిన 102 ఏళ్ల వృద్ధురాలు కంచరాన సీతమ్మ శుక్రవారం మృతిచెందారు. ఈమెకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. సీతమ్మ మృతి పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

'బీఆర్‌ఎస్‌కు అవగాహన లేదు'



హనుమంతు లజపతిరాయ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులపై అవగాహన లేకుండా అమరావతి రాజధానికి అనుకూలమంటూ బీఆర్ఎస్ ప్రకటించటం అవగాహన రాహిత్యమని రాష్ట్ర వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. ఎచ్చెర్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ మూడు రాజధానులు అవసరం లేదని చెప్పటం అవగాహన రాహిత్యమని పేర్కొన్నారు. ముందుగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల ఆకాంక్షలను తెలుసుకోవాలని హితవుపలికారు. ప్రస్తుతం మూడు రాజధానులు అమలు చేసి అభివృద్ధి వికేంద్రీకరణ చేయకపోతే భవిష్యత్తులో చిన్న రాష్ట్రాల ఉద్యమాలు పుట్టుకువస్తాయన్నారు. తెలంగాణాలో 26 బీసీ కులాల రిజర్వేషన్ తొలగించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు.

ఆ ఫొటోతో మృతదేహం గుర్తింపు



యువకుడిని అభినందించి, రివార్డు అందిస్తున్న ఎస్ఐ కృష్ణప్రసాదు

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస సమీపంలోని ముంగెన్న చెరువులో ఓ వ్యక్తి మృతదేహం ఇటీవల పోలీసులకు లభ్యమైంది. కానీ అతని వివరాలు ఎవరికీ తెలియలేదు. దీంతో పోలీసులకు ఈ మృతదేహం ఎవరికి అప్పగించాలో, ఎవరికి చెప్పాలో పాలుపోలేదు. రోజుల తరబడి దర్యాప్తు చేసేంత సమయం కూడా లేదు. ఇలాంటి సమయంలో ఒక ఫొటో పోలీసుల పనిని ఈజీ చేసేసింది. కటకటమయ్యపేట గ్రామానికి చెందిన యువకుడు ప్రదీప్‌కుమార్ సరదాగా తీసిన ఒక ఫొటో మృతుడి వివరాలను తెలుసుకునేందుకు ఉపయోగపడింది. చనిపోయిన వ్యక్తి గోవాకు చెందిన వాడు. మతిస్థిమితం కోల్పోయి ఊరూరా తిరుగుతూ కటకటమయ్యపేట గ్రామానికి వచ్చాడు. అప్పట్లో అతనికి ఆ గ్రామస్తులు దుస్తులు అందించారు. అప్పుడు ప్రదీప్ ఓ ఫొటో తీశాడు. ఆ ఫొటో ఇప్పుడు పోలీసుల కంటపడడంతో మృతుడి అడ్రస్ సేకరించడం సులువైంది. దీంతో వెంటనే మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాదు స్వయంగా గ్రామానికి వెళ్లి యువకుడు ప్రదీప్‌ను అభినందించి, రివార్డు అందించారు. గ్రామాలకు ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చిన వెంటనే ఫొటోలు తీసి భద్రపరచాలని గ్రామస్తులకు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలకు చెక్

- జిల్లాలో కొనసాగుతున్న పోల్ టు పోల్ సర్వే
- వెనువెంటనే పునరుద్ధరణ పనులు చేపడుతున్న సిబ్బంది
- మరో దశాబ్దం వరకు లైన్లు దెబ్బతినకుండా చర్యలు



వాలిపోయిన విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

అరసవల్లి: అనంతపురంలో గత ఏడాది అక్టోబర్‌లో విద్యుత్ తీగలు తెగిపడి అక్కడికక్కడే ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. కాలపరిమితి దాటేసిన విద్యుత్ వైర్లు, కండక్టర్లు ఇతరత్రా సామగ్రియే ఈ దుర్ఘటనకు కారణమని తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకుని అన్ని జిల్లాల్లోనూ విద్యుత్ ప్రమాదాలను పూర్తిస్థాయిలో నియంత్రించాలనే లక్ష్యంగా పెట్టుకుంది. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అన్ని విద్యుత్ పంపిణీ సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోనూ అన్ని సర్కిళ్లల్లోనూ క్షేత్ర స్థాయిలో సర్వే చేసి విద్యుత్ తీగలను, కండక్టర్లను ఇతరత్రా వ్యవస్థలను పటిష్టం చేయాలని, కాలం ముగిసిన విద్యుత్ సామగ్రిని తక్షణమే మార్చేయాలని ఈపీడీసీఎల్ అధికారులు నిర్ణయించారు. జిల్లాలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రెండు నెలల నుంచి పోల్ టు పోల్ సర్వేను కొనసాగిస్తున్నారు. సర్వేలో గుర్తించిన వేలాది కిలోమీటర్ల విద్యుత్ లైన్లు, వేలాది విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చేసి వ్యవస్థను పునరుద్ధరణ చర్యలకు విద్యుత్ అధికారుల బృందం నడుంబిగించారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో సర్వే ఆధారంగా పునరుద్ధరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

వాలిన స్తంభాలు	దెబ్బతిన్న స్తంభాలు	వేలాడుతున్న వైర్లు	స్పాన్లు	దెబ్బతిన్న కండక్టర్లు
33 కేవీ	317	118	578	24.39 కి.మీ.
11 కేవీ	4550	10514	8138	1862 కి.మీ.
ఎల్.టి	6109	22300	9713	2339 కి.మీ.

భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా..

జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ డివిజన్ల పరిధిలోని మొత్తం 33 కేవీ, 11 కేవీ విద్యుత్ ఫీడర్లతో పాటు ఎల్‌టీ విద్యుత్ లైన్ల పరిధిలో విద్యుత్ శాఖ సిబ్బంది సర్వే చేపట్టారు. మొత్తం 13 అంశాల వారీగా సర్వే జరగగా దాదాపు అన్ని విభాగాల్లోనూ మార్పులు చేయాల్సిన ఆవశ్యకతను అధికారులు గుర్తించారు. జిల్లాలో 33 కేవీ విద్యుత్ లైన్లు 1319 కిలోమీటర్లు, 11 కేవీ లైన్లు 8019 కి.మీ, ఎల్‌టీ లైన్లు 14823 కి.మీ.వరకు ఉండగా, సుమారు 4.80 లక్షల విద్యుత్ స్తంభాలున్నాయి. మొత్తం 407లో 359 ఫీడర్లు సర్వే పూర్తి కాగా, ట్రాన్స్‌ఫార్మర్లు 24,627లో ప్రస్తుతానికి 7004 వరకు ట్రాన్స్‌ఫార్మర్లను మార్పు చేశారు. వీటిన్నింటినీ సర్వే చేయగా అందులో సగం వరకు పునరుద్ధరణ చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే..భవిష్యత్‌లో మరిన్ని దశాబ్దాల పాటు విద్యుత్ సమస్యలు రావనే అభిప్రాయాన్ని విద్యుత్ ఇంజినీర్లు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లోనే విద్యుత్ పరికరాలు, సామగ్రి దాదాపుగా దెబ్బతింటున్న పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గాలను అధికారులు అన్వేషిస్తున్నారు.

మూడు నెలల్లో పూర్తి..



విద్యుత్ ప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న కీలకమైన నిర్ణయం ఇది. దశాబ్దాల కాలం క్రితం నుంచి ఉన్న విద్యుత్ వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉంది. ఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం జిల్లాలో పోల్ టు పోల్ సర్వే చేపట్టాం. లోపాలు, మరమ్మతు పనులపై నివేదికను సిద్ధం చేసుకున్నాం. ప్రస్తుతానికి బడ్జెట్ మేరకు పనులు చేపడుతున్నాం. మరో మూడు నెలల్లో పూర్తిస్థాయిలో మరమ్మతులు, పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తాం.

– ఎల్.దైవప్రసాద్, విద్యుత్ సర్కిల్ ఎస్ఈ

ఉపాధి వేతనదారులకు పీఎంఎస్‌బీ యోజన



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి వేతనదారులందరికీ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనను వర్తింపజేయనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు జి.వి.చిట్టిరాజు తెలిపారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 50 ఏళ్ల వేతనదారులు అర్హులని చెప్పారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.లక్ష పరిహారం అందుతుందని తెలిపారు. ఏడాదికి రూ.20 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వెలుగు ప్లాస్టర్ ఫెసిలిటేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో మెలిగి ఈ పథకంలో వేతనదారులను భాగస్వాములను చేయాలన్నారు.జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ కొన్ని మండలాల్లో పూర్తికాకపోవడం పట్ల పీడీ అసహనం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా 61 పని దినాలు ఉన్నందున పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. 2 లక్షల జాబ్ కార్డుదారులకు 100 రోజుల పనిదినాలు కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. సగటు వేతనం రూ.250కి తగ్గితే సహించేది లేదన్నారు. జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ ప్రతి బుధవారం జరిగే ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో పీఎంఎస్‌బీ యోజన ప్రగతిని అడిగి తెలుసుకోవాలన్నారు. సమావేశంలో ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఏపీడీలు శైలజ, యుగంధర్, హరిత, ప్లాంటేషన్ మేనేజర్ శ్యామల, సూపర్‌వైజర్ జి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 102 మంది ఎంపిక



కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాలో 102 మంది వివిద ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్ఈఈడీఏపీ), జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం మరియు నోడల్ జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళాలో నిరుద్యోగ యువతీయువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడాప్ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు, ఉపాధికి పెద్దపీట వేస్తుందన్నారు. డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు ఇంటర్వ్యూలు జరుగుతున్న క్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ, జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్, మెప్మా పీడీ కిరణ్, సీడాప్ డీజీఎం రమణమూర్తి, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, నోడల్ జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ డి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాత



నువ్వలరేవు తీరానికి చేరిన తాబేళ్ల కళేబరాలు

వజ్రపుకొత్తూరు రూరల్: సముద్ర జీవుల్లో అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. సంతానోత్పత్తి కోసం గుడ్లు పెట్టేందుకు వేల మైళ్ల దూరం నుంచి ఇక్కడి తీరానికి ఇవి వస్తుంటాయి. ఈ తరుణంలో మత్స్యకారులు వినియోగిస్తున్న నిషేధ వలల తాకిడికి అలాగే ఇంజిన్ల తగిలి ఇవి చనిపోతున్నాయి. ఇలా మృత్యువాత పడిన తాబేళ్లు తీరానికి కొట్టుకు వస్తున్నాయి. విశాల సముద్ర తీరం కలిగిన శ్రీకాకుళం జిల్లాలో అక్కుపల్లి, నువ్వలరేవు, మంచినీళ్లపేట, చిన కొత్తూరు, కంబలరాయుడు పేట, రట్టి, భావనపాడు, గుణుపల్లి తదితర తీరాల్లో పదుల సంఖ్యలో తాబేళ్ల కళేబరాలు కనిపిస్తున్నాయి. వీటి నుంచి దుర్వాసన రావడంతో మత్స్యకారులు తీరంలో గల ఇసుక తిన్నెలలో కప్పిపూడుస్తున్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సిక్కోలు బోణీ



రాష్ట్ర పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన సిక్కోలు మాస్టర్స్ అథ్లెట్స్ వీరే

శ్రీకాకుళం న్యూకాలనీ: మాస్టర్స్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సిక్కోలు బోణీ చేసింది. గుంటూరు వేదికగా జరుగుతున్న 40వ ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ సంఘం చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అధ్యక్షుడు ఎండీ ఖాసీం ఖాన్, కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డిల ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించగా.. తొలిరోజు శుక్రవారం 21 పతకాలు సాధించి శభాష్ అనిపించారు. ఇందులో పది బంగారు, ఐదు రజత, మరో ఆరు కాంస్య పతకాలు ఉన్నాయి. శనివారం కూడా పోటీలు కొనసాగనున్నాయి.

ఉత్కంఠగా పాలిటెక్నిక్ క్రీడాపోటీలు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పురుషుల, శ్రీకాకుళం మహిళల పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ప్రాంతీయ పాలిటెక్నిక్ క్రీడాపోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. రెండో రోజు శనివారం జరిగిన పోటీల్లో 10 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల విభాగంలో 100 మీటర్ల రన్నింగ్‌లో వై.దివ్య (శివాని), ఎం.మౌనిక (వెంకటేశ్వర), ఎం.సౌజన్య (శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. 200 మీటర్ల పరుగులో ఝూన్సీ (వెంకటేశ్వర), సౌజన్య (శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్), యోగిత (శ్రీకాకుళం మహిళా పాలిటెక్నిక్), 400 మీటర్ల రన్నింగ్‌లో శిరీష (వెంకటేశ్వర), లావణ్య (వెంకటేశ్వర), పద్మా (నారాయణ), 800 మీటర్ల పరుగులో లావణ్య (వెంకటేశ్వర), శిరీష (వెంకటేశ్వర), శ్రావణి(ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఇతర విభాగాల్లోనూ విద్యార్థులు రాణించారు.

ఏసీబీకి చిక్కిన కనిమెట్ట వీఆర్‌ఓ

- మ్యుటేషన్ కోసం రూ. 3 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం

పొందూరు: మండలంలోని కనిమెట్ట వీఆర్‌ఓ ఎం.గోవిందరావు రూ.3వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. శ్రీకాకుళం అవినీతి నిరోధక శాఖ అధికారి బీవీఎస్ఎస్ రమణమూర్తి అందించిన వివరాల మేరకు.. మండలంలోని కనిమెట్ట గ్రామం రెవెన్యూ అధికారిగా ముంజేటి గోవిందరావు పనిచేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన బొడ్డేపల్లి భారతమ్మ మూడు నెలల కిందట భూమి మ్యుటేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆమె బంధువు నంద నాగరాజు మ్యుటేషన్ కోసం వీఆర్‌వోను పలుమార్లు సంప్రదించారు. అయితే మ్యుటేషన్ చేయాలంటే రూ. 3 వేలు లంచం ఇవ్వాలని వీఆర్‌వో డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో మ్యుటేషన్ చేయలేదు. నాలుగు రోజుల కిందట నాగరాజు వీఆర్‌ఓను కలిస్తే.. మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో వారు ఈ నెల 4న ఆన్‌లైన్‌లో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు కూడా లంచం డిమాండ్ చేయడంతో నంద నాగరాజు అవినీతి నిరోధక శాఖను సంప్రదించారు. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి సూచనలతో నాగరాజు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే ఏసీబీ అధికారులు వల పన్ని ఉండడంతో నాగరాజు నుంచి వీఆర్‌ఓ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీఆర్‌వో నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని ఏసీబీ కోర్టుకు తరలించారు. ఈ దాడిలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సీఐ భాస్కరరావు, సీఐ హరి, ఎస్ఐలు చిన్నంనాయుడు, సత్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన వీఆర్‌వో గోవిందరావు

మత్స్యకారుల వలసల నివారణే లక్ష్యం



బుడగుట్లపాలెం సముద్రతీరాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, జేసీ నవీన్

- చంద్రబాబు చెప్పినట్లే పవన్ మాట్లాడతారు
- బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ స్థలం పరిశీలనలో మంత్రి సీదిరి అప్పలరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా నుంచి మత్స్యకారుల వలసలను శాశ్వతంగా నివారించాలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెంలో రూ.365 కోట్లతో చేపట్టనున్న ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. తీరంతో పాటు ప్రభుత్వం సేకరించిన 42 ఎకరాల స్థలాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడారు. జిల్లాలో కరోనా సమయంలో పది వేల మంది వలస కార్మికులు ఉండగా, అందులో ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన వారే ఎనిమిది వేల మంది ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బుడగుట్లపాలెంలో హార్బర్ నిర్మిస్తే వలస నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. భావన పాడులో పోర్టు, మంచినీళ్లపేటలో జెట్టీల నిర్మాణం పూర్తయ్యాక హార్బర్‌గా మార్పు, బుడగుట్లపాలెం హార్బర్ అందుబాటులోకి వస్తే మత్స్యకారులకు పుష్కలంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ఈ క్రమంలో రాష్ట్రంలో తొమ్మిది హార్బర్లు మంజూరు చేయగా, నాలుగు నిర్మాణ దశలో ఉన్నాయని, మిగిలిన నిర్మాణాలు త్వరంలో చేపట్టనున్నట్లు తెలిపారు. తీర ప్రాంతం ప్రగతి కోసం ప్రభుత్వం రూ.3600 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. బుడగుట్లపాలెం హార్బర్ నిర్మాణానికి స్థల పరిశీలన, భూసేకరణ, టెండర్లు పూర్తయ్యాయని, విశ్వ సముద్ర సంస్థకు నిర్మాణ బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. రూ.120 కోట్లు పీఎంఎస్‌వై పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందజేయనుందని చెప్పారు. దేశంలో గుజరాత్‌లో 18, తమిళనాడులో 14, కర్నాటకలో 10 హార్బర్లు ఉండగా, ఏపీలో మాత్రం విశాఖపట్నం, కాకినాడల్లో మాత్రమే ఉన్నాయని, గత ప్రభుత్వాలు తీర ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశాయని దుయ్యబట్టారు. జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ ప్యాకేజీ నాయకుడని విమర్శించారు. చంద్రబాబు ప్యాకేజీ ఇస్తే ఆయన మాట్లాడుతున్నాడని విమర్శించారు. ప్రజారాజ్యంలో ఉన్నప్పుడు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మద్దతుగా నిలిచినప్పుడు మత్స్యకారుల కోసం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పాకిస్థాన్‌లో మత్స్యకారులు చిక్కుకున్నప్పుడు వారిని విడిపించేందుకు, కరోనా వేళ ఇతర రాష్ట్రాల నుంచి వలస మత్స్యకారులను స్వగ్రామాలకు తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసిందని గుర్తు చేశారు. మత్స్యకారుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎచ్చెర్ల జెడ్పీటీసీ, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ అధ్యక్షురాలు బల్లాడ హేమమాలినీ రెడ్డి, తహశీల్దార్ సత్యనారాయణ, పలాస–కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, మత్స్యశాఖ జేడీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి రాంబాబు, బల్లాడ జనార్దనరెడ్డి, మూగి శ్రీరాములు, బడివానిపేట సర్పంచ్ కారి తాతారావు, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, బోర సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని అడ్డుకున్న ఎమ్మెల్యే అశోక్



పనులను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే అశోక్, టీడీపీ నేతలు

ఇచ్ఛాపురం రూరల్: అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. కొత్తూరి గ్రామంలో రెండున్నర సెంట్ల ప్రభుత్వ స్థలంలో నాడు-నేడు పథకం ద్వారా రూ.16 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి మూడు నెలలు క్రితం ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ దుక్క ధనలక్ష్మి భూమిపూజ చేశారు. ఆ స్థలంపై కన్నేసిన టీడీపీ కార్యకర్తలు అప్పట్లో అడ్డుకున్నప్పటికీ రెవిన్యూశాఖాధికారుల జోక్యంతో వెనక్కి తగ్గారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి సచివాలయ సిబ్బంది జేసీబీతో పునాదులు తీస్తున్న సమయంలో టీడీపీ నేతల సమాచారం మేరకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ పనులను అడ్డుకున్నారు. చిన్నారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున రోడ్డుకు దగ్గరగా భవన నిర్మాణం చేపట్టకూడదని హుకుం జారీ చేశారు. అయితే గ్రామస్తుల సూచనల మేరకే నిర్మాణం చేపడుతున్నట్లు సీడీపీఓ పి.నాగరాణి సమాధానం ఇచ్చారు. అయినా ఎమ్మెల్యే తగ్గకుండా ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్మాణం చేపట్టరాదన్నారు. సర్పంచ్‌ధనలక్ష్మి, ఎంపీటీసీ ప్రతినిధి పిట్ట విశ్వనాథంతో పాటు కొంతమంది గ్రామస్తులు భవనం ఇక్కడే నిర్మించాలంటూ కోరగా, స్థానిక టీడీపీ కార్యకర్తలు, నేతలు ససేమిరా అంటూ కేకలు వేయడంతో ఇచ్ఛాపురం రూరల్ పోలీసులు ఇరువర్గాలను వారించారు. అనంతరం అధికారులు వెనుదిరిగారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క కార్యాలయం నిర్మించకపోగా, ఇప్పుడు అభివృద్ధిని అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని పలువురు విమర్శిస్తున్నారు.

పర్యాటక కేంద్రాలుగా బీచ్‌లు



వివరాలు సేకరిస్తున్న పర్యాటక శాఖ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: బీచ్‌లను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్లు ఏపీ టూరిజం కన్సల్టెంట్ రాజ్ కుమార్, జిల్లా సహాయ పర్యాటక అధికారి దున్న రమేష్ అన్నారు. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం, డి.మత్స్యలేశం పంచాయతీ కొత్త మత్స్యలేశం బీచ్‌లను శుక్రవారం పరిశీలించారు. పర్యాటకానికి అనుకూలంగా ఉండటంతో పాటు శ్రీకాకుళం నగరానికి దగ్గర్లోనే ఉండటంతో అభివృద్ధి పనులకు తీసుకోవాల్సిన చర్యలపై ఏపీ టూరిజం శాఖకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. బీచ్‌లను అనుసంధానం చేస్తూ అంతర్గత రోడ్లు వేస్తే పర్యాటకం మరింత ప్రగతి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పర్యాటక మండలి సభ్యులు పంచిరెడ్డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలో ఎలుగు సంచారం



బైపల్లి పరిసర తోటల్లో సంచరిస్తున్న ఎలుగు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం తీర ప్రాంతాల్లో ఎలుగులు సంచరిస్తూ ప్రజలకు భయాందోళనకు గురి చేస్తున్నాయి. శారదపురంలో గురువారం దూడపై గుర్తు తెలియని జంతువు దాడి చేసింది. శుక్రవారం బైపల్లి,బాతుపురం పరిసర తోటల్లో ఎలుగు సంచారంతో మళ్లీ ఉద్దానంకు ఎలుగు గుబులు పట్టుకుంది. ప్రస్తుతం జీడి, మామిడి పంట పూత దశలో ఉండటంతో ఎరువులు, పురుగు మందులు పిచికారి చేసేందుకు, కంచెలను ఏర్పాటు చేసేందుకు రైతులు తోటలకు వెళ్తున్నారు. ఈ తరుణంలో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వారు భయపడుతున్నారు.

8న గ్రూప్-1 పరీక్ష

- జిల్లాలో 19 కేంద్రాలు
- హాజరు కానున్న 5600 మంది అభ్యర్థులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైజన్ ఆఫీసర్లుగా సీనియర్ జిల్లా అధికారులను నియమించినట్లు తెలిపారు. మెటీరియల్ తీసుకువెళ్లే వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ పరీక్షలకు 5,600 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వివరించారు. 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున మొత్తం 219 మందిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటుచేయాలని సూచించారు. మౌలిక వసతుల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులకు సూచనలు ఇచ్చారు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, పరీక్షకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా 08942 240557 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కంట్రోల్ రూమ్ ఆదివారం సాయంత్రం వరకు పనిచేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి మాట్లాడుతూ లైజన్ అధికారులుగా జిల్లా అధికారులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీపీఎస్సీ నుంచి సహాయ కార్యదర్శి బీఎస్ మూర్తి మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం 9.45 గంటల వరకు, మధ్యాహ్నం 1.45 గంటల వరకు అనుమతించాలన్నారు.